క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం టౌన్: పట్టణంలోని మోత్కుపల్లి మెయిన్ రోడ్డులో 11 కేవీ లైన్ లాగుతున్నందున గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు. పట్టణంలోని మోత్కుపల్లి మెయిన్ రోడ్డు, తిరుమల లేఔట్, శ్రీనివాస ఐటీఐ కాలేజీ ఏరియా, డ్వాక్రా కాలనీ, మార్కండేయనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు శంకరనారాయణ

రొద్దం: మండల పరిధిలోని నారనాగేపల్లికి చెందిన పింజిరి మస్తాన్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు మాలగుండ్ల శంకరనారాయణ బుధవారం ఆ గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆర్థిక సాయం అందించారు. అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కురుబ లక్ష్మీనారాయణ అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆయన్ను కూడా శంకరనారాయణ పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచులు నాగార్జున, సామిరెడ్డి, గంగన్న, కోనాపురం వెంకటరమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు సాగునీటి సంఘం నాయకులతో సమీక్ష

రొళ్ల: మండల కేంద్రమైన తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో గురువారం మధ్యాహ్నం ఎంపీడీఓతో కలిసి సాగునీటి ఆయకట్టు సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ షేక్షావలి ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని గ్రామాల సాగునీటి సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు తప్పని సరిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ కళాశాలలను ఏర్పాటు చేయండి

హిందూపురం టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఉర్దూ కళాశాలను ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు బాబావలి డిమాండ్ చేశారు. దశాబ్ద కాలంగా మాటలకే పరిమితమైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్, ఉర్దూ జూనియర్ కళాశాలను ఏర్పాటులో నిర్లక్ష్యాన్ని విడాలని ప్రభుత్వాన్ని కోరారు. దీంతోపాటు ప్రభుత్వ విద్యా సంస్థలలో అనేక సమస్యలు నిలయంగా ఉన్నాయని, కనీసం మౌలిక సదుపాయాలు కూడా కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఈ సమస్యలన్నిటిని పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే బాలకృష్ణ స్పందించి ప్రభుత్వ కళాశాలలను ఏర్పాటుకు కృషి చేయాలన్నారు.

ఆరెకటికలకు చేయూతనివ్వాలి

హిందూపురం: రాష్ట్ర ఆరెకటిక సంక్షేమ అభివృద్ధి సంఘం చైర్మన్‌గా హెచ్.హరికృష్ణ ఎన్నిక కావడం హర్షనీయమని రాష్ట్ర ఆరెకటిక సాధికార సమితి సభ్యుడు కె.రాజశేఖర్, పురం ఆరెకటిక సంఘం సభ్యుడు జె.సునీల్‌రాజ్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు. ఆరెకటికలు అన్ని రకాలుగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం చేయూత ఇవ్వాలన్నారు. ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం కటికలకు అన్ని రకాలుగా న్యాయం చేయాలన్నారు. అలాగే తమ కులానికి రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని కోరారు.

మాజీ ఎంపీ శ్రీరామిరెడ్డికి ఘన నివాళి



శ్రీరామిరెడ్డి సమాధి వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి రఘువీరా

మడకశిరరూరల్: మండలంలోని నీలకంఠాపురంలో స్వాతంత్య్ర సమరయోధుడు, మాజీ ఎంపీ స్వర్గీయ శ్రీరామిరెడ్డి 32వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తన పెద్దనాన్న, స్వర్గీయ శ్రీరామరెడ్డి సమాధి వద్ద మాజీ మంత్రి ఎన్ రఘువీరారెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థులు దేశ భక్తి గీతం పాట పాడుతూ ర్యాలీ చేశారు.


గౌరాజుపల్లిలో నీటి ఎద్దడి

- పనిచేయని రక్షిత నీటి పథకం ఆర్వో ప్లాంట్
- ఏడాదిగా పట్టించుకోని అధికారులు
- ప్రత్యామ్నాయం చూపకపోవడంతో ప్రజలు పాట్లు

రొద్దం: కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అభివృద్ధి దేవుడికెరుక.. కనీసం గుక్కెడు నీరు ఇచ్చేందుకు పాలకులు, అధికారులకు మనసు రావడం లేదు. గ్రామంలో ఏర్పాటు చేసిన రక్షిత తాగునీటి పథకం ఆర్వో ప్లాంటు నిర్వహణ లోపంతో ఏడాదిగా నిరుపయోగంగా మారింది. కనీసం ప్రత్యామ్నాయం కూడా లేక ప్రజలు తాగునీటి కోసం అవస్థలు పడాల్సి వస్తోంది.



గౌరాజుపల్లిలో ఏడాదిగా పనిచేయని ఆర్వో ప్లాంట్



తాగునీటి ట్యాంక్ వద్ద పెరిగిన కంపచెట్లు

మండలంలోని గౌరాజుపల్లి గ్రామంలో గ్రామంలో దాదాపు 1400 జనాభా ఉంది. ఫ్లోరైడ్ అధికంగా ఉండడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. దీంతో ఎన్ఆర్‌డీపీ నిధులు రూ.7.10 లక్షలు వెచ్చించి ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేశారు. అయితే గత ఏడాదిగా ఆర్వో ప్లాంట్ మరమ్మతుకు గురయ్యింది. ఆర్వో ప్లాంట్ నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారింది. అధికారులు గానీ, పాలకులు గానీ పట్టించుకోలేదు. రొద్దం గ్రామం నుంచి నీటి ట్యాంకర్ వస్తేనే తాగునీరు దొరుకుతుందని లేదంటే తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఏడాదిగా తాగునీటి పథకం ఆర్వో ప్లాంట్ పనిచేయకపోతే వాటి వైపు కనీసం కన్నెత్తి చూడలేదని గ్రామస్తులు వాపోతున్నారు. సంవత్సర కాలంగా ప్లాంట్ పరికరాలు మూలనపడ్డాయి. వ్యవసాయ బోరుబావుల నీటిపై ఆధారపడాల్సి వస్తోంది.

నిర్వాహకులు స్పందించాలి..



తాగునీటి సమస్యపై నిర్వాహకులు, సంబంధిత అధికారులు స్పందించాలి. ఆర్వో ప్లాంట్‌ను మరమ్మతులు చేయించాలి. ఏడాదిగా తాగునీటి సమస్యతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోలేదు.

– జానకి, గౌరాజుపల్లి, రొద్దం మండలం

మరమ్మతు చేయించాలి



ఆర్వో ప్లాంట్‌కు మరమ్మతు చేయించి తాగునీటి సమస్య పరిష్కరించాలి. సంవత్సర కాలంగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నాము. అధికారులకు, ప్రజాప్రతినిధులకు చెప్పినా స్పందనలేదు. గ్రామస్తులు పడుతున్న తాగునీటి ఇబ్బందులను అధికారులు గ్రహించి సమస్య పరిష్కరించాలి.

– హేమలత, గౌరాజుపల్లి, రొద్దం మండలం

ముగిసిన శిక్షణ తరగతులు

మడకశిర: పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మడకశిర డివిజన్ పరిధిలో ఉన్న ఆర్ఎస్‌కే (రైతు సేవా కేంద్రాలు) ఇన్‌చార్జ్‌లకు బుధవారం శిక్షణ కార్యక్రమం ముగిసింది. సోమవారం నుంచి మూడు రోజుల పాటు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ ఇచ్చారు. మూడో రోజు బుధవారం వేరుశనగ, రాగి, కంది పంటల సాగుపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఓలు తిమ్మప్ప, నాగరాజు, ఎస్‌పీఎం అధికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారిపై చర్యలు తీసుకోండి



ఎంపీడీఓకు వినతిపత్రాన్ని ఇస్తున్న ఎంపీపీ సవిత తదితరులు

పరిగి: మండలంలోని ఓ ఉన్నతస్థాయి అధికారి ప్రజాప్రతినిధులంటే లెక్కలేకుండా ప్రవర్తిస్తున్నారని సదరు అధికారిపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఎంపీపీ సవితతో పాటు మండల ప్రజాప్రతినిధులు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ రెడ్డెప్పకు బుధవారం వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ కార్యక్రమాలకు కనీస ఆహ్వానాన్ని ఇవ్వకుండా నడిపిస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు చిక్కన్న, మారుతీరెడ్డి, కోఆప్షన్ మెంబర్ సలీం, సీనియర్ నాయకుడు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి మోసాలపై ప్రభుత్వాన్ని నిలదీద్దాం



మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్



బాధితులతో మాట్లాడుతున్న ఉషశ్రీచరణ్

సోమందేపల్లి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలు నిలదీయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని బ్రహ్మసముద్రం, చల్లాపల్లి, నడింపల్లి గ్రామాల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తున్నా హామీలు అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఇది మంచి ప్రభుత్వం కాదని, ముంచే ప్రభుత్వమని ఎద్దేవా చేశారు. మంత్రి సవిత కర్ణాటక నుంచి పెట్రోల్, డీజిల్‌ను, అలాగే ఇసుక అక్రమ రవాణ, పరిశ్రమలను భయపెడుతూ అక్రమంగా సంపాదిస్తున్నారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజేంద్ర, జెడ్పీటీసీ అశోక్, వైస్ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి, సర్పంచులు పరంధామ, సౌజన్య, రామాంజి, కిష్టప్ప, సోము, వైస్ సర్పంచులు వేణు, నాయకులు కంబాలప్ప, సత్యనారాయణరెడ్డి, జయచంద్రారెడ్డి, అమర్, ఆదెప్ప, జితేంద్రరెడ్డి, దాము, ఈశ్వర్, హరీష్, ప్రవీణ్, రాజు, అంజనరెడ్డి, గోవిందరెడ్డి, అశ్వర్థప్ప, ఆదినారాయణరెడ్డి, మంజు, చంద్ర, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి అండతోనే పట్టాల తొలగింపు

పెనుకొండ రూరల్: మంత్రి సవిత అండతోనే రెవెన్యూ అధికారులు పేదల పట్టాలను తొలగించారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ విమర్శించారు. బుధవారం పట్టణంలోని జగనన్న కాలనీలో పట్టాలు తొలగింపునకు గురైన బాధితులతో కలసి కాలనీని సందర్శించారు. ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని లబ్ధిదారులకు హామీ ఇచ్చారు. అనంతరం ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ.. పట్టణంలోని సర్వే నంబర్ 228–2, 262, 263లలో 25 ఎకరాల్లో గత ప్రభుత్వం జగనన్న లే అవుట్లు వేసిందన్నారు. గత ప్రభుత్వంలో పట్టాలు పొందిన లబ్ధిదారులను కాదని కొత్తవారికి ఎలా పట్టాలు మంజూరు చేస్తారని ప్రశ్నించారు. ఆర్థిక కారణాలతో వెనుకబడిన 64 మంది నిరుపేదలైన ఎస్సీ, ఎస్టీల పట్టాలు తొలగించడం దారుణమన్నారు. మంత్రి సవిత.. తన అనుచరుల కోసం పేదల పట్టాలను దోచుకోవడం భావ్యం కాదన్నారు. ఇంటి నిర్మాణం కోసం వేసుకొన్న పునాదులు తొలగించడం, పునాది బిల్లు సైతం ప్రభుత్వం ఇచ్చినప్పటికీ మంత్రి అనుచరులు అక్రమంగా తొలగించడంపై మంత్రి సవిత సమాధానం చెప్పాలన్నారు. ఇప్పటికే మంత్రి అనుచరులు అక్రమ కట్టడాలు మొదలు పెట్టారన్నారు. జిల్లా అధికారులు దృష్టి సారించి పేదలకు న్యాయం చెయ్యాలన్నారు. లేకపోతే పేదల కోసం న్యాయ పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ, మండల కన్వీనర్లు బోయ నరసింహా, సుధాకర్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సల్లా సూర్య ప్రకాశ్‌రెడ్డి, కౌన్సిలర్లు శేషాద్రి, సద్దాం, నాయకులు బాబు, శ్రీరాములు, యాసిన్, కొండలరాయుడు, చెన్నకేశవులు తదిరులు పాల్గొన్నారు.

పత్తి, పట్టు రైతులకు వాన కష్టాలు



మడకశిర: నియోజకవర్గ వ్యాప్తంగా నాలుగైదు రోజుల నుంచి ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో జనజీవనానికి అంతరాయం కలుగుతోంది. ప్రధానంగా పత్తి, పట్టు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం విత్తన పత్తి క్రాస్ చేసే ప్రక్రియ చివరి దశలో ఉంది. అయితే వర్షాలు పడుతుండడంతో క్రాస్ చేసే ప్రక్రియకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. కొందరు రైతులు క్రాస్ చేసే ప్రక్రియను నిలిపివేశారు. వర్షంలో ఆడ, మగ పువ్వులను క్రాస్ చేసినా ఫలితం ఉండదని రైతులు చెబుతున్నారు. అదే విధంగా పట్టు పురుగుల పెంపకానికి కూడా ఈవర్షం వలన రైతులు అవస్థ పడుతున్నారు. మల్బరీ ఆకు వర్షానికి నాని పోతోంది. తేమలేని ఆకునే పట్టు పురుగులకు మేతగా వేయాలి. అయితే ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో ఆకు పూర్తిగా తడిసి పోతుండడంతో రైతులు పట్టు పురుగులకు మేత వేయ లేకపోతున్నారు. ఇదిలా ఉండగా మంగళవారం రాత్రి గుడిబండలో 19.6 మి.మీ, రొళ్లలో 11.4, మడకశిరలో 10.4, అమరాపురంలో 8.6, అగళిలో 6.2 మి.మీ చొప్పున వర్షం కురిసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. ఈవర్షాలు ఇంకా నాలుగైదు రోజుల పాటు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు చెబుతుండడంతో పత్తి, పట్టు రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

డిప్లొమా ఇన్ ఫార్మసీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

హిందూపురం టౌన్: పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ఇన్ ఫార్మసీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కళ్యాణ్ తెలిపారు. రెండేళ్ల నిడివిగల డీ ఫార్మసీ కోర్సులో 2025–26 విద్యా సంవత్సర ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందన్నారు. ఈ నెల 9 నుంచి 19 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు పది, ఇంటర్ మార్కుల జాబితాతో కళాశాలలో స్పందించాలన్నారు వివరాలకు ఫోన్ నంబర్ 9703843680కు సంప్రదించాలని సూచించారు.

ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా

హిందూపురం/మడకశిర: ఏపీఎస్ఆర్టీసీ ప్రభుత్వ పరంగా ఎదుర్కొనుచున్న అనేక సమస్యల పరిష్కరం కోసం రెండు రోజుల ధర్నా కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆర్టీసీ డిపో గేటు వద్ద ఎస్ఎంయూ ఆధ్వర్యంలో సిబ్బంది ధర్నా చేట్టారు. డిపో కార్యదర్శి వెంకటేష్ , రీజినల్ ఉపాధ్యక్షులు వలీ సాబ్, జాయింట్ సెక్రెటరీ విజయలక్ష్మి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు మడకశిరలోనూ ఎస్ఎంయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

రోడ్డుపై నీరు నిల్వ లేకుండా చర్యలు



ఆలూడిలో రోడ్డులో ఉన్న మురుగును పరిశీలిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

అగళి: మండల పరిధిలోని ఆలూడి గ్రామాన్ని బుధవారం వైద్య ఆరోగ్య,సర్పంచ్ సందర్శించారు. 'చినుకు పడితే చిత్తడే' అన్న శీర్షిక సాక్షిలో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సర్పంచ్ బసవరాజు, వైద్య ఆరోగ్యశాఖ హెచ్ఏ సుందర్య , ఎంఎల్‌హెచ్ పీ నవీన, సిబ్బంది గ్రామాన్ని సందర్శించారు. గ్రామంలో ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకొని, రోడ్డుపై నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్థానికులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు అనుగుణంగా బస్సులు నడపాలి

హిందూపురం: విద్యార్థులకు అనుకూలంగా కలిపి–రొద్దం ఆర్టీసీ బస్సు నడపాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు బుధవారం హిందూపురం ఆర్టీసీ అధికారులకు విన్నవించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి మాట్లాడుతూ రొద్దం, కల్లకుంట, చిన్నమంతూరు, చెరుకూరు, పెద్దమంతూరు, శేషాపురం, కలిపి, మరువపల్లి, గ్రామాల నుంచి విద్యను అభ్యసించడానికి హిందూపురం పట్టణానికి వివిధ కళాశాలలకు 50 మందికి పైగా విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. వీరికి సరైన ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక అనేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. విద్యార్థుల సమయానికి అనుగుణంగా బస్సులు నడపాలన్నారు.

సాగు పట్టాలు పంపిణీ చేయండి

పెనుకొండ రూరల్: సాగులో ఉన్న భూమికి పట్టాలు మంజూరు చేయాలని తుంగోడుకు చెందిన రైతులు నిరసన ర్యాలీ చేపట్టారు. సాగు పట్టాలు అందించాలి, సాగు భూమికి హక్కులు కల్పించాలంటూ తుంగోడు, చిన్నబాబయ్యపల్లి, కూటిమానిపల్లి, కొనతట్టుపల్లి, వెలిదడకలకు చెందిన రైతులు నినాదాలు చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి తమకు న్యాయం చేయాలని ఆర్డీఓ ఆనంద్‌కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందించారు.

నిడుగల్ ఉత్సవాలకు తరలిరండి

పావగడ: తాలూకాలోని పర్యాటక కేంద్రంగా పేరు పొందిన నిడుగల్ దుర్గం ఉత్సవాలకు ప్రజలందరూ తరలిరావాలని నిడుగల్ మహర్షి వాల్మీకి ఆశ్రమాధిపతి వాల్మీకి సంజయ కుమార స్వామి జీ పిలుపు నిచ్చారు. ఈ నెల 18న నిడుగల్ ఉత్సవాలు రామతీర్థ ప్రాంతంలో వైభవంగా జరుగతాయన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహించే ఈ ఉత్సవాలను అందరూ విజయవంతం చేయాలన్నారు.

సంక్షిప్త సమాచారం

మాదక ద్రవ్యాలపై అవగాహన



ఎంజేపీలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

పెనుకొండ: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు ప్రిన్సిపాల్ సుదర్శన్ అవగాహన కల్పించారు. అలాగే ట్రైనీ ఎస్ఐ భువనేశ్వరి బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలను వివరించారు. అధ్యాపకులు ఎస్‌మూర్తి, జనార్దన్, శివణ్ణ, రవికుమార్, శ్రీలేఖ, నోడల్ ఆఫీసర్ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వెంటనే జీతాలు చెల్లించండి

రొళ్ల: కేవలం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నియమించారనే ఎంటీఎస్ ఉపాధ్యాయులపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు ధోరణి ప్రదర్శిస్తోందని మండల వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో పని చేస్తున్న 53 మంది ఎంటీఎస్ ఉపాధ్యాయులు మండల ఉపాధ్యాయ భవనం వద్దకు చేరుకొని బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ ఏడాది జూన్, జూలైకు సంబంధించిన జీతాలు తమకు అందలేదన్నారు. వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

గుడిబండ: స్థానిక ఎంజేపీ బాలికల కళాశాల ఆవరణలో గురువారం ఎస్ఐ రాజ్‌కుళ్లాయప్ప ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిషేధంపై విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఎస్ఐ మాట్లాడుతూ బంగారు భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి పంచాయతీ పరిధి పెద్దిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ నాయకులు చేయూతనందించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు స్థానిక నాయకుడు నరసింహారెడ్డి ఆర్థిక సహకారంతో నోట్‌బుక్కులు, పెన్నులు, అట్టలు, పలకలు అందించారు. కార్యక్రమంలో విశ్వనాథరెడ్డి, గఫార్‌ఖాన్, నాగమణి, రాజేష్, బాలాజీ, నాగభూషణ తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

సోమందేపల్లి: ఖరీఫ్‌కు సంబంధించి రైతులు సాగుచేస్తున్న పంటలను ఈ–క్రాప్ చేయించుకోవాలని ఏఓ విజయభారతి తెలిపారు. బుధవారం నడింపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంట నమోదు చేసుకుంటేనే ఇన్‌పుట్ సబ్సిడీ, విత్తనాలు ఇతర పథకాలకు అర్హులు అవుతారన్నారు.

ప్రజా ప్రతినిధులంటే గౌరవం లేదా?

- అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు
- వాడీవేడిగా పరిగి మండల మీట్



ఎంపీటీసీ మారుతీరెడ్డితో వాగ్వాదానికి దిగిన ఇరిగేషన్ అధికారి లక్ష్మీనారాయణ

పరిగి: 'ప్రజా ప్రతినిధులంటే ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజలచేత ఎన్నుకోబడిన వ్యక్తులని కొందరు అధికారులు గుర్తించాలి. అధికారం శాశ్వతం కాదన్న విషయాన్ని గమనించాలి' అని పలువురు ప్రజాప్రతినిధులు వాపోయారు. సభా గౌరవాన్ని లెక్కచేయకుండా ప్రజా ప్రతినిధులమని గుర్తించకుండా నిండు సభలో తమను అగౌరవపరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిగిలో బుధవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీపీ సవిత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ రెడ్డెప్ప ఆధ్వర్యంలో వాడివేడిగా సాగింది. మండల అగ్రికల్చర్ ఆఫీసర్ శ్రీకృష్ణ మాట్లాడుతూ పొలంబడి కార్యక్రమం ద్వారా అన్ని గ్రామాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. అయితే ప్రజా ప్రతినిధులుగా ఉంటున్న తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే కేవలం కూటమి నేతలను మాత్రమే ఆహ్వానించి తూతూ మంత్రంగా కార్యక్రమాలను చేపట్టడమేంటని ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు.

నాకు పరిగొక్కటే కాదు..

గడిచిన మూడు సమావేశాలకు ఎందుకు రాలేదని సభలో ఎంపీటీసీ మారుతీరెడ్డి, నారాయణరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సలీం ఇరిగేషన్ శాఖ ఏఈఈ లక్ష్మీనారాయణను ప్రశ్నించారు. పరిగి చెరువు, కొడిగెనహళ్లి, శ్రీరంగరాజుపల్లి తదితర ప్రాంతాల్లో మట్టిని ఇష్టారాజ్యంగా దోచేస్తున్నప్పటికీ కనీసం కన్నెత్తిచూడకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి ఇరిగేషన్‌శాఖ అధికారి స్పందిస్తూ తాను పరిగి మండలానికి మాత్రమే అధికారి కాదంటూ సభ్యులతో వాగ్వాదానికి దిగారు. ఒకానొక దశలో స్థైర్యం కోల్పోయి సింగల్ వర్డ్‌తో సభలో సభ్యులను కించపరుస్తూ మాట్లాడటంపై సభ్యుల అభ్యంతరం తెలిపారు. ఓ అధికారిగా ఉంటూ రాజకీయ పార్టీకి ఒత్తాసు పలుకున్నట్లుగా ఉందని, ఈమాత్రం దానికి సమావేశాలు ఎందుకు నిర్వహించాలని ప్రశ్నించారు. సభలో ప్రజాప్రతినిధుల అడిగిన ప్రశ్నలకు సమాధానమివ్వాల్సిందిపోయి వారిపైనే ఎదురుదాడికి దిగడం సమంజసం కాదని ఎంపీపీ సవిత స్పష్టం చేశారు.

కుక్క కాటుపై వివాదం

బీచిగానిపల్లిలో మల్లేష్ అనే వ్యక్తికి కుక్క కరిచి పరిగి పీహెచ్‌సీకి వెళ్తే మరో ముగ్గురు కుక్క కాటు బాధితులు వచ్చే వరకూ వెయిట్ చేయాలని పీహెచ్‌సీలో వైద్యారోగ్య అధికారే నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారన్న అంశంపై సభలో గందరగోళం నెలకొంది. మెడికల్ ఆఫీసర్ నవీన స్పందిస్తూ విచారణ జరిపి చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిస్తామని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.